తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 | పేజీలు : 8



Follow :

# కౌంటింగ్‌కు సర్వం సిద్ధం


## కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి





**బోధన్, ఫిబ్రవరి 12 (జనంసాక్షి) :**
బోధన్ పట్టణంలోని విజయ మేరీ పాఠశాలలో నిర్వహించే కౌంటింగ్ కేంద్రాలను గురువారం సాయంత్రం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. బోధన్ లోని విజయ మేరీ హైస్కూల్ లో కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను, కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్ లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను సైతం కలెక్టర్ సందర్శించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ భావోద్వేగాలతో ముడిపడి ఉన్నందున ఎంతో జాగ్రత్తతో బాధ్యతాయుతంగా కౌంటింగ్ విధులు నిర్వహించాలని కలెక్టర్ హితవు పలికారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను తు.చ తప్పక పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా ఓట్ల లెక్కింపు జరపాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, సొంత నిర్ణయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయకూడదని అన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాల వెల్లడిలో గందరగోళానికి గురి కాకూడదని, ఒకటికి రెండు సార్లు జాగ్రత్తగా పరిశీలించుకుని వెల్లడించాలని సూచించారు. కౌంటింగ్ హాలు లోనికి ఆర్.ఓ మినహా ఇతరులు ఎవరికీ సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సమయ పాలన పాటిస్తూ కౌంటింగ్ విధులకు సకాలంలో చేరుకోవాలని ఆదేశించారు. ఉదయం స్ట్రాంగ్ రూమ్ ల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్లకు చేరుస్తూ, 8.00 గంటల నుండి అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందని వెల్లడించారు. నిర్ణీత సమయానికి కౌంటింగ్ ప్రారంభించేందుకు వీలుగా సిబ్బందిని అన్నివిధాలుగా సన్నద్ధం చేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఇప్పటికే పలు విడతలుగా శిక్షణ తరగతులు నిర్వహించి పూర్తి అవగాహన కల్పించామని అన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద డివిజన్/వార్డు వివరాలను తెలిపేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామని, ఎలాంటి పొరపాట్లు, గందరగోళానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో టేబుల్ కు ఒక కౌంటింగ్ సూపర్వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లతో పాటు సపోర్టింగ్ స్టాఫ్ ను నియమించామని అన్నారు. ఆయా మున్సిపాలిటీల పరిధిలో పోల్ అయిన ఓట్లను రౌండ్ల వారీగా లెక్కించేందుకు వీలుగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల అనుసారం అదనపు సిబ్బందిని సైతం రిజర్వ్ లో ఉంచామని అన్నారు. కాగా, అభ్యర్థులు, వారి తరఫున ఏజెంట్లు వారికి సూచించబడిన సమయం ఉదయం 7.00 గంటల లోపు కౌంటింగ్ సెంటర్ల వద్దకు రావాలని కలెక్టర్ సూచించారు. తాము జారీ చేసిన ఎంట్రీ పాసులతో పాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పాసు కలిగి ఉన్న వారినే కౌంటింగ్ సెంటర్ లోనికి అనుమతించడం జరుగుతుందన్నారు. అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా తుది ఏర్పాట్లను పూర్తి చేశామని, సిబ్బందికి అల్పాహారం, భోజనాలను కూడా ఓట్ల లెక్కింపు కేంద్రంలో అందుబాటులో

మిగతా 8లో




- శాటిలైట్ మ్యాపింగ్ సర్వేతోపంట భూముల గుర్తింపు
- ఫిబ్రవరి మొదటి వారం వరకుపంటల సాగుతర్వాతే రైతుల ఖాతాల్లో..

# సాగు భూములకే 'భరోసా'

**కోనరావుపేట (జనంసాక్షి):** రైతుభరోసా పథకం నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు సాగు చేసిన రైతులకే పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది ఈ మేరకు సింథటిక్ ఎపర్చర్ రాడార్ (సడ్) టెక్నాలజీతో శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు చేసిన భూములను గుర్తించి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ప్రభుత్వం బావిస్తోంది. శాటిలైట్ మ్యాపింగ్తో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో చేపట్టి క్రాప్ బంకింగ్ సర్వేను కూడా పరిగణనలోకి తీసుకుని ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించారు గతంలో. పట్టా భూములు కలిగిన వారందరికీ రైతుబంధు పథకాన్ని వర్తింపజేసి ధరణి పోర్టల్ ను అనుసంధానం చేసుకుని డబ్బులు, జమ చేశారు. దీంతో రియల్ ఎస్టేట్ వెంచర్లు. ప్రభుత్వ అవసరాల కోసం భూములు ఇచ్చిన వారికి, పంటలు సాగు కానీ బీడు భూములు, రాళ్లు, రప్పలు, బండా రాయి తదితర భూములు గలవారికి రైతుబంధు డబ్బులు అందాయి. తాము అధికారంలోకి వస్తే పంటలు సాగు చేసే వారికే రైతుభరోసా వర్తింప జేస్తామని, ఎకరానికి రెండు పంటలకు కలిపి 15 వేల రూపాయల చొప్పున. పెట్టుబడి సాయాన్ని అందజేస్తామని కాంగ్రెస్ పార్టీఎన్నికల సందర్భంగా ప్రకటించింది. ఆ మేరకు అధికారం లోకి వచ్చి

8వ పేజీలో

## ఎన్నికల కౌంటింగ్ కు సర్వం సిద్ధం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 12 (జనంసాక్షి)**
మున్సిపల్ ఎన్నికలు బుధవారం జరిగాయి. వేములవాడలోని సినారె కళామందిర్ లో ఎన్నికల ఫలితాల ప్రక్రియ కొరకు కౌంటింగ్ సెంటర్లో సర్వం సిద్ధం చేశారు. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత ఈ నెల 16న మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ల పదవులకు పరోక్ష ఎన్నికలు జరగనున్నాయి. వేములవాడ మున్సిపల్ పరిధిలో మొత్తం ఓటర్లు 40,877 మంది ఉండగా 31,803 ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పురుషులు 14,742 ఓట్లు, స్త్రీలు 17,803ఓట్లు,ఇతరులు 6 గురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నేడు సినారే కళామందిర్లో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. 7 గంటలకు వరకు కౌంటిగ్ ఏజెంట్లు రావాల్సి ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. మొదటగా పోస్టల్ బ్యాలెట్ వార్డు వారీగా లెక్కించిన అనంతరం 28 వార్డులకు సంబంధించి ఓట్ల లెక్కింపును ఒకేసారి ప్రారంభిస్తారు. ప్రతీ 1000 ఓట్లకు ఒక రౌండ్ గా పరిగణించి లెక్కించనున్నారు. 1000 పైగా ఉంటే రెండో రౌండ్ లెక్కింపు జరుగనుంది. 3 వార్డులకు మినహా మిగతా వార్డులలో రెండో రౌండ్ లెక్కింపు జరుగనుంది. మధ్యాహ్నం 1 గంట తరువాత అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

## పెద్దపల్లి మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు



**పెద్దపల్లి,ఫిబ్రవరి 12(జనంసాక్షి) :**
పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సరళి ని ఎమ్మెల్యే విజయ రమణారావు గురువారం పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ అభ్యర్థులు, నాయకుల తో కలిసి సమీక్షించారు. శుక్రవారం జరిగే కౌంటింగ్ సందర్భంగా తీసుకునే జాగ్రత్తల గురించి నాయకులు, కార్యకర్తలకు పలు కీలక, సూచనలు సలహాలు ఇచ్చిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ

మిగతా 8లో

## సమన్వయంతో మహా శివరాత్రి జాతర విజయవంతం చేయాలి

9లో



# బీజేపీ,బిఆర్ఎస్‌లది ఫెవికల్ బంధం

- కాంగ్రెస్ పార్టీపై అసత్యపు ఆరోపణలు..
- మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

వార్తా మెయిన్ పేజీలో

# సైబర్ మోసాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



## మంథని కెడిసిసి బ్యాంక్ మేనేజర్ కె.ఉదయశ్రీ

**మంథని, (జనంసాక్షి) :** లోన్ యాప్, లాటరి, పార్ట్ టైం జాబ్స్, విదేశీ ప్రయాణం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పాన్ కార్డ్స్ అప్డేట్, ఆదార్ కార్డు లింకేజి పేరుతో మెసేజెస్, ఓటిపిలు రాగానే ఆశపడి ఓపెన్ చేసి మోసపోవద్దని కెడిసిసి బ్యాంక్ మేనేజర్ కె.ఉదయశ్రీ అన్నారు. గురువారం మంథని మండలం కాకర్లపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవహగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మంథని కెడిసిసి బ్యాంక్ మేనేజర్ కె.ఉదయశ్రీ మాట్లాడుతూ.. గూగుల్ లో లోన్స్ యాప్స్ కోసం సెర్చ్ చేయడం కానీ చేయవద్దని, నేరగాళ్ళు మన అకౌంట్ లో కొంత ముందుగా డబ్బులు జమ చేసి ఆ తదుపరి మన అకౌంట్ లోని డబ్బులను కాజేస్తారని అన్నారు. సైబర్ నేరగాల్లు ఆశ, భయం అనే రెండు అంశాల మీద సైబర్ నేరాలు చేస్తారని, డెబిట్, క్రెడిట్ కార్డులు ఉపయోగించేటప్పుడు కూడా చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సహకార బ్యాంక్ యందు ఖాతా కలిగిన ప్రతి ఒక్క ఖాతాదారు కేవైసీ వివరాలు సమర్పించాలని కోరారు.అలాగే ప్రతీ ఒక్క రైతుకు పంట ఋణం అందించేందుకు బ్యాంకు ఎల్లప్పుడూ ముందు ఉంటుందని, కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణ పంపిణి చేస్తున్నామని తెలిపారు. నగదు రహిత లావాదేవీలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. సౌభాగ్య డిపాజిట్ పథకం 333 రోజులకు గాను సాధారణ పౌరులకు 8.0, సీనియర్ సిటిజన్లకు 8.5శాతం వడ్డీ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, అలాగే మహిళలకు ప్రత్యేకంగా 8.50 వడ్డీ సౌకర్యం కల్పిస్తున్నామని, ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక, జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సహకార బ్యాంక్, సంఘాల ద్వారా అందిస్తున్న ఋణాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సహకార బ్యాంక్ ద్వారా పాడిపశువులు, గొర్రెలు, పండ్లు, ఆయిల్ ఫాం తోటల పెంపకం, పాలీహౌస్లు, పవర్ టిల్లర్స్, గోదాంలకు, ట్రాక్టర్స్, హార్వేస్టర్లు, గోల్డ్ లోన్స్, స్వయం సహాయక సంఘాలకు, గృహ నిర్మాణాలు, కొనుగోళ్లకు, వ్యాపారస్తులకు, ఉద్యోగస్తులకు వ్యక్తిగత, విదేశీ విద్యా, మార్టిగేజ్, ఎస్ హెచ్ జి, జెఎల్ జీ, ఇళ్ల రిపేరుకు, ఇంటిరియర్ డెకరేషను, పీఎంఇజిపి, కార్పొరేషన్ ఋణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే సహకార బ్యాంక్ ద్వారా యూపిఐ, ఐఎంపిఎస్, గూగుల్ పే, ఫోన్ పే, ఆన్లైన్ సేవలు ఖాతాదారులకు అందుబాటులో ఉన్నాయని, వీటిని ఉపయోగించుకోవాలని కోరారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకానికి రూ.436, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకం రూ.20 చెల్లించి ఉపయోగించుకోవాలని ఖాతాదారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ కన్నెబోయిన కొమురయ్య, ఉపసర్పంచ్ ఆకుల ప్రత్యూష-సాయికుమార్, నాయకులు మెండె రాజయ్య, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, కెడిసిసి బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సందేబోయిన శ్రీనివాస్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్లు పోతరాజు సతీష్ కుమార్, వసంత, బ్యాంక్ సిబ్బంది పూజిత, మహేందర్, మహేశ్వరి, సాయి, సహకార సంఘం సిబ్బంది దుబ్బాక సదాశివ్,నారమల్ల విద్యాసాగర్,బొద్దుల సమ్మయ్య, పైడాకుల రాకేశ్, గుడేల్లి మధుమోహన్, రాగం అశోక్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ రద్దుకై కదం తొక్కిన కార్మిక లోకం




**మంథని, (జనంసాక్షి) :** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యోగ కార్మికులు కదం తొక్కారు. మంథని మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీ ప్రదర్శనతో తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తాసిల్దార్ ఆరిఫుద్దీన్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం ప్రజాస్వామికంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెనక్కి తీసుకోవాలని గ్రామీణ ప్రాంతాలలో పేదలకు ఆసరగ ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తొలగించడం చాలా అన్యాయమని అన్నారు. జి రాంజీ పథకాన్ని రద్దుచేసి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే 2025 విద్యుత్ సవరణ బిల్లును రైతు చట్టాలను ఉపసంహరించుకోవాలని అన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని మున్సిపల్ గ్రామపంచాయతీ కార్మికుల పర్మినెంట్ చేసి కానీ సవేతనం అమలు చేయాలని హాస్పిటల్ కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వేతనాలు పెంచి నెల నెల నేరుగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్, సీఐటీయూ నాయకులు మల్లేష్, చందు గట్టయ్య, భాగ్య పోచమ్మ, సుగుణ, సుజాత, భాగ్య, రజిత, శ్రావణ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైన్స్ బెల్టు షాపుల దోపిడి ఆపేది ఎవరు



**ముస్తాబాద్ ఫిబ్రవరి 12 (జనం సాక్షి)** ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామంలో బెల్టు షాపుల యజమాన్యం ఒక్కొక్క సీసాపై బీర్ మరియు క్వార్టర్స్ పై న ఎమ్మార్పీ రేటు కంటే అదనంగా 30 రూపాయలను వసూలు చేస్తున్నారని బదనకల్ భారతీయ జనతా పార్టీ శక్తి కేంద్రం ఇంచార్జ్ రాయము రాజు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులను నిర్వహిస్తూ ఒక్కొక్క సీసా పైన 30 రూపాయలు అదనంగా వసూలు చేయడంపై సామాన్య ప్రజలపై అధిక భారం పడుతుందని ఇలా ఎందుకు అదనంగా 30 రూపాయలు వసూలు చేస్తున్నారని బెల్ట్ షాప్ యాజమాన్యం ను ప్రశ్నించగా ముస్తాబాద్ మండల కేంద్రంలో ఉన్న వైన్స్ షాపుల నిర్వాహకులు బెల్టు షాపుల వారి నుండి ఒక్కొక్క సీసా బీర్ మరియు క్వాటర్స్ పైన 15 రూపాయలు ఎమ్మార్పీ కంటే అదనంగా వసూలు చేస్తున్నారని తక్కువ రేటుకు మేము ఎలా ఇవ్వాలి అంటూ బెల్ట్ షాప్ యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు వారన్నారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని టాక్సీ లతో సహా ఎమ్మార్పీ రేటుకు మాత్రమే విక్రయాలు జరగాలి తప్ప ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి వైన్ షాపుల యజమాన్యం ఎమ్మార్పీ కంటే అధికంగా ఒక్కొక్క సీసాపై 15 రూపాయలు బెల్ట్ షాపుల వారి నుండి వసూలు చేయడం ఏమిటని.? మండలంలో పలు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పడుతున్న మౌన పాత్ర వహిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారుల అలసత్వం ఏమిటని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు ఈ భారతీయ జనతా పార్టీ శక్తి కేంద్రం ఇంచార్జి రాయం రాజు యాదవ్ రాయనీ బాను కొమ్మెటా రామచంద్రం తదితరులు పాల్గొన్నారు

## అంగరంగ వైభవంగా వశిష్ట విద్యాసంస్థల వార్షికోత్సవ సంబరాలు




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 12 (జనం సాక్షి)**జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్లో గురువారం వశిష్ట విద్యాసంస్థల 23వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల విభాగం అధిపతి ప్రొఫెసర్ సంపత్ కుమార్ పాల్గొని విద్యార్థులు చక్కగా చదువుకొని,కళాశాలలో ఉన్న అన్ని సదుపాయాలను ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.కళాశాలల సీ.ఈ.వో.ఆర్. హరిస్మరన్ రెడ్డి మాట్లాడుతూ విద్యతోపాటు నైపుణ్యాలు నేర్చుకొని చక్కటి ఉద్యోగాలను సాధించాలని కోరారు.విద్యార్థులు రకరకాల సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని ఆట , పాటలతో అలరించారు.కళాశాల నిర్వహించిన సాంస్కృతిక మరియు ఆటలు పోటీలలో విజయాలు సాధించిన విద్యార్థులకు,కళాశాల టాపర్లకు బహుమతుల ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాలల డైరెక్టర్లు ఏ. జనార్దన్ రెడ్డి, బి. బాలాజీ రావు, ఐ. రాజేశ్వరరావు, కె. శ్రీనివాస్, బి శేషారావు, వశిష్ట డిగ్రీ పిజి కళాశాలల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. అనిల్ రెడ్డి, వశిష్ట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం. రాజు, ఉపన్యాసకులు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## వెండి నాణెం పేరుతో ఓటర్లను బురిడీ కొట్టించిన వైనం



**సిరిసిల్ల టౌన్ ఫిబ్రవరి 12 (జనం సాక్షి)**సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కొన్ని వార్డుల్లో ఓ పార్టీకి చెందిన నాయకులు ఓటర్లను బురిడీ కొట్టించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వెండి నాణెం పేరుతో సదరు పార్టీ నాయకులు అందచేసిన నాణేలు చివరికి అవి ఇనుమువని తేలడంతో ఓటర్లు నివ్వెర పోతున్నారు. సదరు పార్టీ నాయకుల వైఖరి పై మండిపడుతున్నారు. వెండి నాణేల ఘటన సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అనేక వార్డుల్లో కలకలం రేపింది. ఓటు కోసం కోటి ఉపాయాలు అన్న చందంగా పరిస్థితి మారింది. మొత్తానికి సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో జరిగిన ఈ వ్యవహారం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## పెద్దమ్మ తల్లి జాతరలో పాల్గొన్న జువ్వాడి బ్రదర్స్

**మల్లాపూర్ ఫిబ్రవరి 12:(జనం సాక్షి)**మండలంలోనిరాఘవపేట రావు పేట గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించిన సందర్భంగా కోరుట్ల కాంగ్రెస్ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు , జువ్వాడి శేఖర్ రావు, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పెద్దమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు..జాతర విజయోత్సవ వేడుకల్లో భాగస్వాములై గ్రామ ప్రజలతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. గ్రామ అభివృద్ధి, శాంతి, సౌభ్రాతృత్వం కోసం పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని కోరారు పోతురాజు ద్యావతి వెంకట్ గ సమక్షంలో పెద్దమ్మ జాతర ప్రాముఖ్యతను వివరించి, రాఘవపేట విశిష్టతలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య , మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి , శ్రీధర్ రెడ్డి మరియు ఇతర మండల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# లో- వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలి

## విద్యుత్ శాఖ ఏఈకి వినతి పత్రం అందజేసిన పేరపల్లి సర్పంచ్



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం పేరపల్లి గ్రామంలో నెలకొన్న లో-వోల్టేజ్ ఇతరత్రా విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ బొంగోని సదయ్య గౌడ్ గురువారం విద్యుత్ శాఖ ఏఈ అశోక్ కుమార్ కి వినతి పత్రాన్ని అందజేశారు. లోఓల్టేజ్ సమస్యతో పాటు ,ట్రాన్స్ ఫార్మర్లు ,రైతుల వ్యవసాయ బావుల లూజ్ పోల్స్ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. తమ వినతిపై విద్యుత్ శాఖ ఏఈ సానుకూలంగా స్పందించి.. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ సదయ్య గౌడ్ ఈ సందర్భంగా తెలియజేశారు.

# ఆర్జీ-2 ఏరియాలో సార్వత్రిక సమ్మె సక్సెస్



**యైటింక్లయిన్ కాలనీ ఫిబ్రవరి 12 (జనంసాక్షి) :** సింగరేణి ఆర్జీ-2 ఏరియాలో సార్వత్రిక సమ్మె సక్సెస్ అయింది. దేశ వ్యాప్తంగా ఇచ్చిన సమ్మెను గురువారం ఐక్య కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ... నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని, బొగ్గు ఉత్పత్తి ని పర్మినెంట్ కార్మికులతో చేయించాలని, సొంత ఇంటి పథకం అమలు చేయాలని, పెర్క్స్ పై ఇన్ కం ట్యాక్స్ యాజమాన్యమే చెల్లించాలని, ప్రతి నెలా మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి, కారుణ్య నియామకాలు చేపట్టాలని, మారుపేర్ల విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిస్మిస్ ఐన కార్మికులకు ఒక సారి అవకాశం కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాల పై మండి పడ్డారు. నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు జీగురు రవీందర్, అయిలీ శ్రీనివాస్, కుంట ప్రవీణ్ కుమార్, కొత్త సత్యనారాయణ రెడ్డి, కొంగర రవీందర్, బీ. అన్నారావు, ఉల్లి మొగిలి, శ్రీనివాస్ రెడ్డి, అవినాశ్, బానోత్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో తల్లుల కమిటీ ఎంపిక



**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12, (జనంసాక్షి)** :ఎల్లారెడ్డిపేట మండలంలోని జై సేవాలాల్ తండా గ్రామంలో గల అంగన్వాడీ టీచర్ భూక్య కళ్యాణి ఆధ్వర్యంలో గురు వారం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తల్లుల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భూక్య కళ్యాణి, చెర్మన్‌గా సర్పంచ్ భూక్య రజిత, సభ్యులుగా సరిత, వెంకటలక్ష్మి, శ్యామల, అజయ్ కుమార్‌లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుండారం సర్పంచ్ మూడవ సరోజ, వివి పార్వతి, హెల్త్ డిపార్మెంట్ ఎమ్ఎల్‌హెచ్‌పి శిల్పా, ఎఎన్ఎమ్ఎస్ ప్రవీణా కుమారి, సువర్ణ, ఆశా వర్కర్క్ సుజాత వాణి, గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలు పాల్గొన్నారు. అనంతరం బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టకాహారం గురించి అవగాహన కల్పించారు.

## కోతులను పట్టేందుకు సర్పంచ్‌కు మాదిగ సంఘం 50 వేల ఆర్థిక సాయం



ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12, **(జనంసాక్షి)** : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కోతుల బెడద విపరీతంగా ఉన్నందున ప్రజలు కోతులతో బెజారవుతుండగా మాదిగ సంఘ నాయకులు కోతుల బెడద లేకుండా చేయాలని గురువారం 50వేల రూపాయాలు సర్పంచ్ ఎలగందుల నర్సింహులుకు అందించారు. అన్ని కుల సంఘాల సమక్షంలో పంచాయితీ పాలకవర్గం కోతుల బెడద లేకుండా గ్రామం నుండి వాటిని తరలించడానికి సమావేశం నిర్వహించి ప్రతి ఇంటికి 250 రూపాయాల చొప్పున ఇచ్చేందుకు తీర్మానించారు. అందులో భాగంగా మాదిగ సంఘ నాయకులు అంబేద్కర్‌నగర్‌కు చెందిన మాదిగ సంఘం తరపున 50 వేల నగదును ఇవ్వడం జరిగింది.

## ఎస్‌సి కమ్యూనిటి హాల్ భవన నిర్మాణానికి భూమి పూజ



ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12, (జనంసాక్షి) : ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగంపల్లి గ్రామంలో రాజ్యసభ నిధుల నుండి మంజూరైనా ఎస్‌సి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గురువారం సర్పంచ్ బాలరాజు నర్సాగౌడ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్సాగౌడ్ మాట్లాడుతూ దామోదర రావు రాజ్యసభ నిధుల నుండి 5 లక్షల రూపాయాలు సిరిసిల్ల శాసన సభ్యులు కల్వకుంట్ల తారాకరామారావు మంజురూ చేయించడం జరిగిందన్నారు. ఇట్టి పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొడ్డు రాజు వార్డు సభ్యులు, పంచాయితీ రాజ్ ఇంజనీయర్ శ్రీనివాస్, పంచాయితీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే



**యైటింక్లయిన్ కాలనీ (పాలకుర్తి) ఫిబ్రవరి 12 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఎలుకల పల్లె, గుంటూరుపల్లి గ్రామాలలో గురువారం కరీంనగర్ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే చేశారు. జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికిగాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహిస్తున్న సర్వేల్లో భాగంగా ఎలుకలపల్లి గుంటూరుపల్లి, గ్రామంలో సర్వే నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలు గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో భాగంగా మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన అనంతరం ట్యాబ్ ద్వారా గ్రామములో కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి, మూడు నెలలపాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు సభ్యులు వారి విద్యా అర్హతల గురించి చదువు మానేసిన ఉన్నత చదువులు వృత్తివిద్య కోర్సులు ఉద్యోగం స్వయం ఉపాధి వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో ఎన్ని గంటలు పని చేశారో ఎంత వేతనం పొందారో వివరాలతోపాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే వారి ఆదాయ వివరాలను కూడా నమోదు చేసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మార్వో జేరిపోతుల సునీత, ఎంపీడీవో శశికళ, ఎంపీ ఓ సుదర్శన చారి జిపిఓ ఇస్తియాక్, పంచాయతీ కార్యదర్శులు రమ్య, మౌనిక, గ్రామ సర్పంచులు ఎర్రం హరినాథ్ రెడ్డి, ఎరుకల అంజయ్య ఉప సర్పంచ్ మెట్టు రామదాసు రెడ్డి, గర్రెపల్లి రమ, వార్డ్ మెంబర్స్ అంగన్వాడి టీచర్స్ , సుజాత , తులసి కవిత ఆశా వర్కర్స్ మాధవి, సుమలత కారోబార్ పసుపుల పృధ్వి, సంతోష్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుంది



**రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు.**

**మల్లాపూర్, పిబ్రవరి 12:(జనం సాక్షి)**మహిళలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందుతేనే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు కోరుట్ల నియోజకవర్గనీ మల్లాపూర్ మండలంలోని సిరిపూర్ గ్రామంలో ఈరోజు 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మూడు వివో ఏ భవనాలకు స్థానిక సర్పంచ్ శ్రీమతి మల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి అంతడుపుల పుష్పలత నరసయ్య తో కలిసి భూమి పూజ నిర్వహించారు అనం తరం మాట్లాడుతూ మహిళాలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందితేనే సమాజం బాగుపడుతుందని అభివృద్ధి చెందుతుందని అన్నారుఅలాగే ప్రభుత్వ నుండి మహిళా సంఘాలకు అందాల్సిన వడ్డీ లేని రుణం కావచ్చు ఇతరత్రా ఉపాధి కి సంబం ధించి సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వంద్వార అందించేందుకు తాము బాధ్యత తీసుకుంటామని అన్నారు అనంతరం ఇదే మండలంలోని రాఘవపేట గ్రామంలో శ్రీ పెద్దమ్మ జాతర ఉత్సవాలలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీమతి పెంట సౌజన్య శ్రీనివాస్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ శ్రీమతి అంతడుపుల పుష్పలత నరసయ్య స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ నల్ల బాపు రెడ్డి ఉప సర్పంచ్ సోమ దప్పుల నరసయ్య నత్తి రాము నత్తి లక్ష్మణ్ గడ్డం శ్రీధర్ రెడ్డి వార్డు సభ్యులు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు

## దేశ వ్యాప్త సమ్మెలో చిగురుమామిడిలో సమ్మె సక్సెస్

### మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి తహసిల్దార్ ఆఫీస్‌కు భారీ ర్యాలీ




**చిగురుమామిడి ఫిబ్రవరి 12(జనంసాక్షి ):**దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మం డల కేంద్రంలో సిఐటీ యూ,ఎఐటియుసి, బిఆర్ టియు తోపాటు దేశంలో అన్ని ట్రేడ్ యూనియన్స్ ,జాతీయ ఫెడరేషన్ ఒక్కరోజు సమ్మెచేయాలని పిలుపును ఇచ్చిన సందర్భంగా నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు.అన్ని రంగాల కార్మికులు ఇందులో భాగస్వాములై ఆశ,అంగన్వాడి,మధ్యాహ్నం భోజనంకార్మికులు,హామలీ,గ్రామపంచాయతీ కార్మికులు బస్ స్టాండ్ నుంచి తహసిల్దార్ ఆఫీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి సభ నిర్వహించారు.బీజేపీ ప్రభుత్వం కార్మిక,రైతు,ప్రజా వ్యతిరేక విధా నాలు నశించాలని డిమాండ్ చేస్తూ,నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాల న్నారు.ఆశ,అంగన్వాడి,మధ్యాహ్నం భోజనం,హామలీ,గ్రామ పంచాయతీ కార్మికులు బస్ స్టాండ్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.ఈ కార్యక్రమానికి సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు మారెళ్ళ శ్రీలత హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి కార్మికులు 100సంవత్సరాలు పోరాడి తీసుకొచ్చిన 29చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోర్స్ తీసుకువచ్చారని మండిపడ్డారు.రాబోయే రోజుల్లో కార్మికులను, రైతులను, ప్రజలను అందరినీ ఐక్యం చేసిపోరాటాలు ఉధృతం చేస్తామని నాలుగు లేబర్ కోర్స్ రద్దు చేసేంతవరకు ఊరుకునేది లేదని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ లీడర్ అంగన్వాడి టీచర్స్ విజయ, తిరుమల,పద్మ,ధనలక్ష్మి, వెల్ పర్స్ పద్మ, పావని, ఆశ మండల అధ్యక్షురాలు పద్మ,కార్యదర్శి బోయిన ప్రియాంక, కల్పన, అంజలి,సునీత,సరోజన,శ్వేత,గ్రామ పంచాయతీ వర్కర్సు సునీత,శాంత,సరవ్వ,రాధ, గందే పాల్గొన్నారు.

## మార్చిలో పరిషత్ ఎన్నికలు




**మంథని, (జనంసాక్షి)** : తెలంగాణ రాష్ట్రంలో పరిషత్ ఎన్నికలను మార్చిలో నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మునిసిపల్ ఎన్నికల్లో ఫలితాలు తమ అంచనాల మేరకు ఉంటే.. అదే ఊపులో పరిషత్ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ ఎన్నికలు జరగకపోతే జిల్లా, మండల పరిషత్లకు కేంద్రం నుంచి రావాల్సిన రూ.450 కోట్ల నిధులు మురిగిపోయే అవకాశం ఉంది. అందుకే పరిషత్ ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం.

# అటవీశాఖ నోడల్ ఆఫీసర్ పర్యటన



**రామగిరి జనం సాక్షి:01**రామగుండం-3 ఏరియాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్, నోడల్ ఆఫీసర్ సి.శరవణన్ (ఐ.ఎఫ్.ఎస్) పర్యటించారు.వారికి ముందుగా రామగిరి అతిథి గృహమునందు ఎస్టేట్స్ విభాగం జనరల్ మేనేజర్ టి.లక్ష్మీపతి గౌడ్, రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాక్రిష్ణ లు పుష్ప గుచ్ఛన్ని అందజేసి స్వాగతం పలికారు.అనంతరం సంబధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మందమర్రి ఏరియా లోని రామకృష్ణాపూర్ ఉపరితల గనికోసం రామగుండం-3 ఏరియా ఓసిపి-1 ఉపరితల గని పరిధిలోని ఓ.బి.డంపుపై కేటాయించిన 102 హెక్టార్ల (సి.ఎ.ల్యాండ్) భూమిని ప్రభుత్వ అటవీ శాఖకు అప్పగించడానికి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు.ఎస్టేట్స్ విభాగం జనరల్ మేనేజర్ టి.లక్ష్మీపతి గౌడ్, రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధా కృష్ణ వారికి వివరాలు తెలియజేశారు.వారితోపాటు అటవీశాఖ హైదరాబాద్ నుండి విచ్చేసిన డిప్యూటీ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ డి.సంహిత, సైంటిఫిక్ ఆఫీసర్ నవీన్, సింగరేణి ఫారెస్ట్రీ అడ్వైజర్ ఫర్గెన్, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ (కాళేశ్వరం సర్కిల్) డాక్టర్ బి.ప్రభాకర్ (ఐఎఫ్ఎస్), డీ.ఎఫ్.ఓ.శివయ్య, ఎఫ్ఆర్ఓలు వినయ్ నాయక్, రమేష్, తోపాటు ఇతర సింగరేణి,ఫారెస్ట్రీ ఉన్నారు.

# రైతుల దారిని కబ్జా చేసి డ్రైనేజీ నిర్మిస్తున్నారని రైతుల ఆందోళన



**చిగురుమామిడి ఫిబ్రవరి12(జనంసాక్షి):**రైతుల దారిని కబ్జా చేసి అక్రమంగా డ్రైనేజీ నిర్మిస్తున్న ఫ్యాక్టరీ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకొని అట్టి నిర్మాణం పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రైతులు గురువారం ఆందోళన చేశారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్ గ్రామ శివారులో ఇటీవల ఏర్పాటు చేసిన దాన ఫ్యాక్టరీ యాజమాన్యం పొలాలకు వెళ్లే రహదారిని,కెనాల్ కాలువలను ఆక్రమించుకొని డ్రైనేజీకి కాలువ కట్టడం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.పొలాలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని,అదేవిధంగా ఫ్యాక్టరీ నుంచి వచ్చే ఆవిరి ఇటువైపు పెట్టడం వల్ల రైతులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు.ఫ్యాక్టరీ యజమాని రైతులకు గాని గ్రామ ప్రజా ప్రతినిధులకు ఎలాంటి సమాచారం లేకుండా నిర్మాణాలు చేయడం ఎంతవరకు సమంజసమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే అధికారులు,ప్రజాప్రతినిధులు కల్పించుకొని వారిపై చర్యలు తీసుకొని నిర్మాణాలను నిలిపివేయాలని కోరుతున్నారు.వందలాదిమంది పనిచేసే ఫ్యాక్టరీలో బాత్రూంలు సరిగా లేకపోవడంతో వ్యర్థ పదార్థాలను పొలాలకు వదులుతున్నారని కయ్యం సారంగం అనే రైతు యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.కబ్జా చేసిన కెనాల్ ను ఎప్పటిలాగే తీసి రైతులకు సాగునీరు అందేలా కృషి చేయాలని వారు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో మాజీఎంపీటీసీ సాంబారి కొమురయ్య,వార్డ్ సభ్యులు పిట్టల తిరుపతి,రైతులు కయ్యం సారంగం,జెట్టి తిరుపతి,కయ్యం శ్రీను,మర్రి శ్రీనివాస్,కయ్యం,బుస చంద్రయ్య,మర్రి రవి,బూస అనిల్,బరిగేలా సదానందం,బామాండ్ల శంకర్, బుస రాజు,బుస చంద్రయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 16న చైర్పర్సన్, మేయర్ ఎన్నిక




**మంథని, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు ఈ నెల 16న కలెక్టర్ల పర్యవేక్షణలో మేయర్లు, ఛైర్పర్సన్ల ఎన్నిక జరగనుంది. రేపు కౌంటింగ్ జరగనుండగా గెలిచిన అభ్యర్థులు 16న ఉ.11 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారు.
మ.12.30 గంటలకు మెజార్టీ ఆధారంగా ఛైర్పర్సన్ లేదా మేయర్ ఎన్నిక, తర్వాత వైస్ ఛైర్పర్సన్ లేదా డిప్యూటీ మేయర్ ఎన్నిక ఉంటుంది. ఈ ఎంపికలో ఎక్అఫీషియో (ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) సభ్యుల ఓట్లూ కీలకం కానున్నాయి.

# ఎస్ జిఎఫ్ క్రికెట్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థి



**ముత్తారం ఫిబ్రవరి 12(జనంసాక్షి)** ముత్తారం మండలం ధర్యాపూర్ తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చిరువెంకట ప్రసాద్ రాష్ట్రస్థాయి ఎస్.జి.ఎఫ్ క్రికెట్ అండర్ 14 పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సంతోష్ కుమార్ గురువారం తెలిపారు. నవంబర్ 6వ తేదీన సిరిసిల్లలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికై శుక్రవారం నుంచి 16 వరకు మహబూబ్ నగర్ జిల్లాలో జడ్చర్ల లో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.ఈ సందర్భంగా చిరువెంకట ప్రసాద్ ని మండల విద్యాధికారి హరి ప్రసాద్,ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్,వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వప్న, తోపాటు పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు ప్రశంసించారు.

# విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ



**ముత్తారం ఫిబ్రవరి 12(జనంసాక్షి)**ముత్తారం మండలం పోతారం గ్రామానికి సంబంధించిన నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ను హరిపురం గ్రామశివారులో సివిల్ ఇ ఇ శ్రీనివాస్ మాజీ సర్పంచ్ వేల్పూరి సంపత్ రావు కలసి గురువారం భూమి పూజ నిర్వహించారు.ముత్తారం సబ్ ఇంజనీర్ సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజనిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓల్టేజీ విద్యుత్ సమస్యలతో కొట్టు మిట్టాడుతున్న పోతారం మైదంబండ హరిపురం కేషన్ పల్లి, గ్రామాలకు ఇక నుంచి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు వీలవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు కనీసవేతనం రూ 26వేలు ఇవ్వాలి

## కార్మిక సంఘాల జెఏసి డిమాండ్

## సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా



**బోధన్, ఫిబ్రవరి 12 ( జనంసాక్షి ) :** దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె లో భాగంగా బోధన్ లో గురువారం రోజున వివిధ రంగాల కార్మికులతో అంబేద్కర్ చౌరస్తా నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు కార్మిక సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. అనంతరం కార్మికుల నుద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు జంబిశెట్టి శంకర్ గౌడ్, ఐఫ్ టియు జిల్లా అధ్యక్షులు పుట్ట వరదయ్యలు మాట్లాడుతూ, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం 26,000/ రూపాయలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం చేసే లెబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాలను కోరారు. కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయాడాన్ని మానుకోవాలన్నారు. మహత్మగాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హమీ పథకం పేరు మార్చడాన్ని పథకానికి నిధుల్లో కోత విధించడం దుర్మార్గం అన్నారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మూడు వ్యవసాయం నల్ల చట్టాలను రద్దు చేయాలన్నారు. అమెరికా, యూరప్ దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛ వ్యవసాయ ఒప్పందం. భారత రైతాంగానికి తీరని నష్టం చేస్తుందని ఒప్పందాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉధ్యమాలు నిర్వహించాలని కార్మికులకు పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సి ఐటియు జిల్లా సీనియర్ నాయకులు కుమారస్వామి, ఐఫ్ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సాయిలు, బిఎల్ టియు జిల్లా నాయకులు దాల్ మల్క పోశెట్టి, లక్ష్మణ్ గౌడ్, నారాయణ గౌడ్, వినోద్ వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

# బిజెపి నేత, సర్పంచ్ సొల్లు అజయ్ వర్మను పరామర్శించిన కేంద్రమంత్రి బండి



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 12 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కరీంనగర్ జిల్లా పరిషత్ వద్ద పోలీసులు జరిపిన లాఠీఛార్జిలో తీవ్రంగా గాయపడిన బిజెపి నేత, సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ నేతలు 58 డివిజన్ లో దొంగ ఓట్లు వేయిస్తున్నారనే సమాచారం మేరకు కరీంనగర్ జిల్లా పరిషత్ పోలింగ్ కేంద్రానికి బిజెపి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లిన నేపథ్యంలో పోలీసులు జరిపిన విచక్షణ రహిత లాఠీ చార్జీలో బిజెపి రాష్ట్ర నాయకులు, గునుకుల కొండాపూర్ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ మోచేయి, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలై కరీంనగర్లోని కార్తికేయ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న అజయ్ వర్మను కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ వైద్యులతో మాట్లాడి అజయ్ వర్మ కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

# భారతీయ కళలను యువత అందిపుచ్చుకోవాలి

## ప్రజ్ఞా ఘోష్



ఎడపల్లి, ఫిబ్రవరి 12 ( జనంసాక్షి ) : విద్యార్థి దశ నుండి భారతీయ కళలను, సాంప్రదాయాలను యువత అందిపుచ్చుకోవాలని ప్రముఖ ప్రఖ్యాత ఒడిస్సీ నృత్య కళాకారిణి ప్రజ్ఞా ఘోష్ స్పష్టం చేశారు. గురువారం ఎడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు వేములపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో స్పైక్ మకే సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్ యూత్ అనే వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నృత్య కళాకారిణి ప్రజ్ఞా ఘోష్ విద్యార్థులకు భారతీయ కళలు, నృత్యం గొప్పతనాన్ని ప్రతి ఒక్కరికి తెలిపాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆమె వివరించారు. ఈ సందర్భంగా ప్రజ్ఞా ఘోష్ విద్యార్థులకు నృత్యకళ పై వివరించడంతోపాటు స్వయంగా వారికి పాఠాలు బోధించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేములపల్లి రవికుమార్, ఇతరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సిఐటియు కార్మికులను ఆదుకోవాలి

## ఎంపీడీవో ఆఫీసు ముందు నిరసన



**గంభీరావుపేట ఫిబ్రవరి 12 (జనం సాక్షి):**రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ఎంపీడీవో కార్యాలయం ముందు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సిఐటియు కార్మికుల ఆధ్వర్యంలో గురువారం రోజున నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 గంటల పని విధానాన్ని తొలగించి 10 గంటలు 12 గంటలు చేయాలని చెప్తున్నారు దీన్ని వెంటనే రద్దు చేయాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని ప్రభుత్వమే నేరుగా 26వేల రూపాయలు అకౌంట్ లో ఇవ్వాలని మరణిస్తే కార్మికుడికి దాన సంస్కార్ల కోసం 20000 ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం ఐదు లక్షలు చెల్లించాలని నాలుగు కోడ్ లను రద్దు చేయాలని ప్రధాన డిమాండ్లపై ఈరోజు నిరసన చేయడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కోశాధికారి బరిగల బిక్షపతి టేకుమల్ల రవి ఎల్లవ్వ లక్ష్మి రాజవ్వ జహంగీర్ నరసింహులు ఎల్లయ్య బిక్షపతి తోపాటుపాల్గొన్నారు

# రాష్ట్రస్థాయి యస్.జి.ఎఫ్ క్రికెట్ పోటీలకు ఎంపికైన పారమిత విద్యార్థులు



**కరీంనగర్, ఫిబ్రవరి 12 (జనంసాక్షి):** ఈ నెల 13 నుండి 26 వ తేదీ వరకు తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆద్వర్యంలో జడ్చర్ల మినీ స్టేడియం, జడ్చర్ల, మహబూబ్‌నగర్ లో జరగనున్న 69వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్ 17(బాలుర) క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీలకు స్థానిక పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 10 వ తరగతి విద్యార్థిని కె. విశ్వతేజ, 9వ తరగతి విద్యార్థి పి. కేదార్‌నాథ్ లు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ హన్మంతరావు తెలిపారు. అదేవిధంగా ఇటీవల సిరిసిల్ల జిల్లా లో జరిగిన అండర్ 17(బాలుర) ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ డా.ఇ. ప్రసాదరావు, డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.యం.ప్రసాద్, కె.హన్మంతరావు, ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయ కర్త రబీంద్ర పాత్రో వ్యాయామ ఉపాధ్యాయుడు యస్. రాజు, జి.మహేష్ లు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి

## ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణ శ్రీ

**గోదావరిఖని, జనంసాక్షి :**ఫిబ్రవరి 13 న ఓట్ల లెక్కింవు నిర్వహించేందుకు గోదావరి ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అన్నారు. ఈ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాలు పంచుకునే సిబ్బంది , ఆర్ ఓ లు , ఎ ఆర్ ఓ లకు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు . ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ లెక్కింపు ప్రక్రియలో పాలుపంచుకునే సిబ్బంది ఉదయం 6.00 గంటలకే కౌంటింగ్ సెంటర్ లో రిపోర్ట్ చేయాలని అన్నారు. ఉదయం 8.00 కు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఆ తరువాత అన్ని డివిజన్లకు సంబంధించి ఏక కాలంలో బ్యాలెట్ బాక్సులలో పోలైన ఓట్ల లెక్కింపు జరుగుతుందని అన్నారు. వెయ్యి ఓట్లకు ఒక రౌండ్ చొప్పున దాదాపు మూడు రౌండ్ లలో లెక్కింపు పూర్తవుతుందని అన్నారు. కౌంటింగ్ సూపర్ వైజర్ గా , కౌంటింగ్ అసిస్టెంట్లుగా 180 మందిని ప్రత్యేకంగా నియమించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో శిక్షకులు కె. శ్రీనివాస్ , జె. శ్రీనివాస్ తో పాటు నగర పాలక సంస్థ ఎ సి పి శ్రీ హరి , టి పి ఎస్ నవీన్ , డి . ఇ . శాంతి స్వరూప్ పాల్గొన్నారు.



# పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకుందాం




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 12 (జనం సాక్షి)** దేశవ్యాప్త సమ్మెలోభాగంగా కామరెడ్డి మునిసిపల్ ఆఫీస్ నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ జరిగింది. అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు సభ జరిగింది సభ అధ్యక్షులుగా కుందారపు రాజనర్సు, బాబాయ్ అక్క సిఐటియు జిల్లా కన్వీనర్ అరుణ్ పాల్గొన్నారు సిఐటియు నాయకులు కే చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మిక సోదరీ, సోదరులారా కామారెడ్డి జిల్లా కేంద్రంలో దేశవ్యాప్త సమ్మె ఘనవిజయం కందారపు రాజనర్సు జిల్లా అధ్యక్షుడు సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు.ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్. జిల్లా కన్వీనర్ కన్వీనర్ అరుణ్ జిల్లా నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం-2025, విబి జి-రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ ఐసిలో 100% విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించాలని, కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు గురువారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ రాష్ట్ర కార్మికవర్గం మొత్తం పాల్గొని జయప్రదం చేయడం కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాల తెలంగాణ రాష్ట్ర కమిటీలు సంయుక్తంగా నిర్ణయించాయి. రాష్ట్రంలోని కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు, ప్రజా సంఘాలు ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇచ్చారన్నారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు, కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని, కార్మికుల్ని నిరాయుధులను చేసి పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్లకు బంగారు పళ్ళెంలో పెట్టి బహుమానం ఇచ్చేందుకు సిద్ధమైంది. అందులో భాగంగానే వీరోచిత ంగా పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసింది. వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను 6 సంవత్సరాల క్రితం తెచ్చిందని. వీటికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడిన ఫలితంగా ఇంతకాలం వాటిని అమలు చేయకుండా ఆపగలిగాము. కానీ నేడు మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలుతో కార్పొరేట్ సంస్థల సులభతర వ్యాపారానికి ద్వారాలు తెరిచింది. కార్పొరేట్ల ప్రయోజనాలు, వారి లాభాలు పెంచేందుకే 2025 నవంబర్ 21న లేబర్ కోడ్స్ అమలుకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు.2025 శీతాకాల పార్లమెంట్ సమావేశాలు ముగిసే సమయంలో హడావుడిగా మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ నోటిఫై చేసింది. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి విబి జి-రామ్ జీ స్కీమ్ను తెచ్చి రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపింది. విద్యుత్ సవరణ బిల్లు-2025, వేతన సవరణ చట్టం, ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి లాంటి మరిన్ని వినాశకరమైన చట్టాలను, బిల్లులను తీసుకొచ్చి శ్రమజీవులపై దాడి చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తారంగా ఉన్న శ్రామిక వర్గాలను చావు దెబ్బ కొట్టిందన్నారు.ఎన్ని పని గంటలు ఉండాలో, ఎప్పుడు విరామం ఉండాలో, ఎంత స్ప్రెడ్ ఓవర్ టైమ్ ఉండాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. మేడే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినం యొక్క పోరాట స్ఫూర్తిని నేటి కార్మికవర్గానికి తెలియకుండా చేసే ప్రయత్నాలకు పూనుకున్నారు. మన రాష్ట్రంతో పాటు ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో పని దినాన్ని 10 గంటలకు, స్ప్రెడ్ ఓవర్ టైమ్ను 12 గంటలకు పెంచుతూ చట్ట సవరణలు చేశారు. నాయకులు ఆశా అంగన్వాడి మున్సిపల్ మధ్యాహ్న భోజనం గ్రామపంచాయతీ కార్మికులు, అధ్యక్ష కార్యదర్శులు,అన్ని విభాగాల కార్మికులు అసంఘటిత కార్మికులు స్వచ్ఛ కార్మికులు స్కీం వర్కర్లు మున్సిపల్ మహబూబ్, దీవెన, శివరాజావ్వ ఆశ వర్కర్ రాజశ్రీ, ఇంద్ర, అంగన్వాడి బాబాయ్ అక్క, లక్ష్మి, మధ్యాహ్న భోజనం వెంకటేష్, గ్రామపంచాయతీ అధ్యక్షుడు బాల నర్సు, కార్మికులు పాల్గొన్నారు.

# 4 లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ కార్మికుల గర్జన



**బోయిన్ పల్లి ఫిబ్రవరి 12 (జనం సాక్షి)** రాజన్న సిరిసిల్ల జిల్లాలో కార్మిక, ప్రజా హక్కుల పరిరక్షణ కోసం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 4 లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా దశాబ్దాలుగా కార్మికులు వీరోచిత పోరాటాలు నిర్వహించి, ఎన్నో త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కోడ్‌ల ప్రతిపాదన వచ్చిన నాటి నుంచి ట్రేడ్ యూనియన్లు, ప్రజాస్వామ్య వాదులు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వాటిని అమలు చేయడానికి సిద్ధమవడం దురదృష్టకరమని విమర్శించారు.కార్మికుల పని సమయం రోజుకు 8 గంటలకే పరిమితం చేయాలని, సంఘటిత?అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని కోరారు. అదేవిధంగా పని భద్రత, ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించి, వ్యవసాయ కూలీలకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అడవుల నుంచి ఆదివాసులను తరిమివేసే చర్యలను నిలిపివేసి, కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న చట్టాలను రద్దు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామంచ అశోక్ తదితరులు పాల్గొన్నారు. వివిధ రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై ఐక్యత ప్రదర్శించారు.

# క్యాంపునకు తరలిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 12 (జనంసాక్షి)**మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే వేములవాడలో క్యాంప్ రాజకీయాలు జోరందుకున్నాయి.మున్సిపల్ పీఠం కైవసమే లక్ష్యంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చాకచక్యంగా పావులు కదుపుతున్నారు. పార్టీ అభ్యర్థులు,నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించిన ప్రభుత్వ విప్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ పీఠం దక్కించుకుందామని మున్సిపల్ కార్యాలయంపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం సాయంత్రం ప్రైవేట్ బస్సు ల్లో క్యాంపుకు తరలి వెళ్లారు. ఇక్కడి నుంచి హైదరాబాద్ కు వెళ్లినట్లు సమాచారం.ఫలితాలు నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటారని సమాచారం.మరో వైపు స్పష్టమైన మెజారిటీ ..చైర్మెన్ పదవి దక్కించుకోవడానికి కావలిసిన మ్యాజిక్ ఫిగర్ చేరు కోకపోతే అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాన పార్టీల నాయకులు సమాలోచనలు చేయడంతో పాటు ప్రణాలికలు రచిస్తున్నారు.

# మెజారిటీ స్థానాలు బీజేపీకే రాబోతున్నయ్



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి12 (జనంసాక్షి) :** కరీంనగర్ కార్పోషన్ ఫలితాల్లో మెజారిటీ స్థానాలు బీజేపీ కైవసం చేసుకోబోతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. యావత్ దేశమంతా కరీంనగర్ ఫలితాలవైపు చూస్తోందన్నారు. బీజేపీకి అనుకూల ఫలితాలు రాబోతున్నాయని, కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించబోతున్నామని చెప్పారు. గురువారం రోజు కరీంనగర్ లోని రాజశ్రీ గార్డెన్ లో బీజేపీ కార్పోరేటర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో బండి సంజయ్ కుమార్ సమావేశమయ్యారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, పార్టీ సీనియర్ నేతలు వాసాల రమేశ్, సాయిని మల్లేశం, గుజ్జ శ్రీను తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... "కరీంనగర్ లో బీజేపీకి మెజారిటీ స్థానాలు రాబోతుండటంతో అధికార కాంగ్రెస్ పార్టీలో కలవరం మొదలైంది. ప్రలోభాలకు గురిచేసి బీజేపీ కార్పొరేటర్లను గుంజాలని చూస్తోంది. అప్పుడే కాంగ్రెస్ నేతలు ఫోన్లు చేస్తూ ప్రలోభాల స్కెచ్ కు తెరదీశారు. జాగ్రత్తగా ఉండండి."అని సూచించారు. పార్టీని మోసం చేస్తే కన్నతల్లిని మోసం చేసినట్లేనని చెప్పిన బండి సంజయ్ "అధికార పార్టీ ఆశలకు లోబడి ఎవరైనా కాంగ్రెస్ లోకి వెళితే తీవ్రమైన పరిణామాలుంటాయని, కార్యకర్తల ఆవేశాన్ని తట్టుకోవడం అసాధ్యం"అని హెచ్చరించారు. ఫలితాల సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అభ్యర్థుల తరపున ఏజెంట్లు ఏం చేయాలనే అంశంపై మాజీ మేయర్ సునీల్ రావు వివరించారు. కౌంటింగ్ ఏజెంట్ల దృష్టి అంతా బ్యాలెట్ పేపర్ మీదే ఉండాలని చెప్పారు. చర్చల పేరుతో, గొడవల పేరుతో దృష్టి మళ్లించేందుకు ప్రత్యర్థులు ప్లాన్ చేసే అవకాశముందని, వాటికి తావివ్వకుండా బ్యాలెట్ పైనే దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ కేంద్రంలో ఎవ్వరితోనూ గొడవ పడొద్దని, ఏదైనా అభ్యంతరం ఉంటే రాతపూర్వకంగా రాసి ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్క సీటు పార్టీకి అత్యంత ముఖ్యమనే విషయాన్ని గుర్తుంచుకుని ప్రతి క్షణం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ అభ్యర్థులంతా బండి సంజయ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల్లో మాకు టిక్కెట్లు ఇవ్వడమే కాకుండా మా గెలుపు కోసం మీరు పడ్డ కష్టాన్ని మరువలేం. ఈ ఎన్నికల్లో మీ కష్టం మీరందించిన సాయం, మీరందించిన సహకారం ఎనలేనిదని బండి సంజయ్ కు ధన్యవాదాలు చెప్పారు. ఎన్నికల్లో గెలిస్తే కరీంనగర్ నుండి కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లి హనుమాన్ ను దర్శించుకుంటే బాగుంటుందని సూచన రాగా సమావేశానికి హాజరైన కార్పొరేటర్ అభ్యర్థులంతా అందరం కలిసే పాదయాత్రగా వెళ్లి హనుమాన్ ను దర్శించుకుందామని చేతులెత్తి సమ్మతిని తెలియజేశారు.

# స్ట్రాంగ్ రూమును పరిశీలించిన ఏసిపి గజ్జి కృష్ణపలు సూచనలు చేసిన ఏసిపి



**సుల్తానాబాద్,ఏప్రిల్ 12(జనంసాక్షి) :** ఈనెల 11న జరిగిన మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 15 వార్డులకు గాను పోలింగ్ అయిన ఓట్ల డబ్బాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూమ్లో భద్రపరచగా, స్ట్రాంగ్ రూమును గురువారం పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ సందర్శించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నేడు జరిగే కౌంటింగ్ కు, భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని సిఐ సుబ్బారెడ్డి ఎస్సై చంద్రకుమార్ కు సూచించారు. కౌంటింగ్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి కౌంటింగ్ కు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏసిపి గజకృష్ణ సూచించారు. ఏసిపి గజ్జి కృష్ణ వెంట సిఐలు సుబ్బారెడ్డి రాజకుమార్ అనిల్ కుమార్ ఎస్సైలు చంద్రకుమార్ లక్ష్మణరావు తో పాటు మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదు



**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన**

**గోదావరిఖని, జనంసాక్షి :**రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు, మంచిర్యాల జోన్‌లోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పారదర్శకంగా ఫలితాలు ప్రకటించేందుకు కఠినమైన మూడంచెల భద్రతా ఏర్పాటు చేసినట్టు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ సందర్భంగా గోదావరిఖని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు,కౌంటింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు భద్రతలో భాగంగా కౌంటింగ్ కేంద్రాల లోపలి భాగం, బయటి ప్రాంగణం, వెలుపలి ప్రధాన రహదారుల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో మరియు వెలుపలి రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, అనధికార వాహనాలు మరియు వ్యక్తులకు అనుమతి లేకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా చేరకుండా ఉండాలని సూచించారు. ప్రజలు మరియు రాజకీయ ప్రతినిధులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డును భద్రతా సిబ్బందికి చూపించిన వారికే కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశం ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ పరికరాలు,లైటర్లు వంటి నిషేధిత వస్తువులను కౌంటింగ్ హాల్లులోకి తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ర్యాలీలు,సభలు, సమావేశాలకు అనుమతి లేదని,బాణాసంచా, డీజేలను పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. అధికారులు, పోలీసులు, ఏజెంట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఏర్పాటు చేసిన భద్రతా బలగాలు డీసీపీలు-02, అడిషనల్ డీసీపీ-01, ఏసీపీలు-07, సీఐలు-33,ఎస్ఐలు-96,ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు-149,కానిస్టేబుళ్లు-518, హోంగార్డులు- 113,స్పెషల్ పార్టీ, ఆర్మ్డ్ సిబ్బంది-158,మొత్తం సుమారు 1075 మంది పోలీస్, భద్రతా సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పోలీస్ కమిషనర్ తెలిపారు.

# సుల్తానాబాద్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా,ఎగురవేస్తాం

## పెద్దపల్లి శాసనసభ్యులు విజయ రమణారావు



**సుల్తానాబాద్,ఏప్రిల్ 12(జనంసాక్షి) :** సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సరళి ని ఎమ్మెల్యే విజయ రమణారావు గురువారం, ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని తన నివాసంలో పార్టీ అభ్యర్థులు,నాయకుల తో కలిసి సమీక్షించారు. నేడు జరిగే కౌంటింగ్ సందర్భంగా తీసుకునే జాగ్రత్తల పై ఎమ్మెల్యే విజయ రమణారావు కార్యకర్తలకు పలు కీలక, సూచనలు సలహాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, సుల్తానాబాద్ మున్సిపల్ లోని 15 వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దాదాపు 20 రోజులుగా పార్టీ విజయం కోసం అహర్నిశలు కష్టపడి కృషి చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఇన్చార్జులకు ఎమ్మెల్యే విజయ రమణారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రానున్న రోజుల్లోనూ సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధి ధ్యేయంగా పనిచేసి మరింతగా ప్రజల మన్నలను పొందుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, ఓదెల ఆలయ చైర్మన్ చికట్ల మొండన్న, ఉట్ల వర ప్రసాద్,సాయిరి మహేందర్, శ్రీగిరి శ్రీనివాస్, ఐల రమేష్ వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, కౌన్సిలర్ అభ్యర్థులు సర్పంచ్ లు,ఎన్నికల ఇంచార్జులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉపన్యాస పోటీలు



**జనం సాక్షి రాయికల్ :**రాయికల్ మండలం మైతాపూర్ ఉన్నత పాఠశాలలో సరోజినినాయుడు జన్మదినం పురస్కరించుకొని ఆంగ్ల భాష దినోత్సవాన్ని గురువారం జరుపుకొన్నారు. సరోజినినాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు కొండూరి రజనీకాంత్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముక్కాల మోహన్ రెడ్డి, వేముల మధు, కల్వకోట కార్తీక్, వేముగంటి గిరిధర్, అంతడుపుల గంగారాజం, సిద్దె గంగారాజం, రాపర్తి నర్సయ్య లు పాల్గొన్నారు.

# యువకుడు అదృశ్యం. కనిపిస్తే సమాచారం ఇవ్వండి

## ఎస్సై చంద్ర కుమార్



**సుల్తానాబాద్,ఏప్రిల్ 12(జనంసాక్షి) :** మండలంలోని కదంబ పూర్ గ్రామానికి చెందిన కోడం రాజేష్ వయస్సు, 32 సంవత్సరములు అనే యువకుడు బోలోరే వాహనం డ్రైవర్ గా విధులు నిర్వహిస్తాడు. ఈనెల 5,న ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషములకు ఇంటిలో నుండి బయటకు వెళ్లి ఇంతవరకు తిరిగి రాకపోవడంతో, తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. పై ఫోటోలోని యువకుడు కనిపిస్తే సుల్తానాబాద్ ఎస్సై సెల్ నెంబర్ 8712656511. లేదా 8712656510.కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# భగ్గుమన్న బొగ్గు బాయిలు..

- సింగరేణి కార్మికులకు జేజేలు..
- ఏరియా వర్క్‌షాప్ ఎదుట ధర్నా..
- ప్రైవేట్ ఓబీ పనులు అడ్డుకున్న టీబీజీకేఎస్..




గోదావరిఖని, జనంసాక్షి : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా సింగరేణి బొగ్గు బావులు భగ్గుమన్నాయి. గురువారం దేశవ్యాప్తంగా జరిపిన సమ్మె సింగరేణి సంస్థలో విజయవంతానికి టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేసి, కార్మికులను వెంటబెట్టుకొని పర్యటించారు. రామగుండం డివిజన్-వన్ పరిధిలోని జీడికే 1,2,2ఏ,11,సిఎస్‌పి, ఓసిపి-5, వర్క్ షాప్‌లపై పర్యటించారు.ఏరియా వర్క్‌షాప్‌లో సింగరేణి అధికారులు బలవంతంగా కొద్దిమంది కార్మికులతో పనిచేయించడానికి నిరసనగా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.చార్జిషీట్, సస్పెన్షన్, గతంలో క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేయబడి ఉన్న కార్మికులను బలవంతంగా విధుల్లోకి తీసుకువస్తున్న యాజమాన్య చర్యలను టీబీజీకేఎస్ తీవ్రంగా ఖండించింది. ఓసిపి ఫైవ్ వద్ద ప్రైవేట్ వ్యక్తులతో షవల్, స్కానియాలతో మట్టిని తరలించే పనులను అడ్డుకున్నారు.ఓసిపి గనిలోనికి వెళ్లకుండా సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు, యూనియన్ నాయకులను, కార్మికులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వీరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్నది. అనంతరం షవల్, లారీలను, పనులు చేస్తున్నటువంటి సిబ్బందిని వెల్లగొట్టడం జరిగింది. సమ్మెకు సహకరించిన కార్మిక వర్గానికి టీబీజీకే జేజేలు పలికింది. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి గోదావరిఖని రెండవ గని వద్ద కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, ఆర్‌జీ-వన్ వైస్ ప్రెసిడెంట్ వడ్డేపల్లి శంకర్, కేంద్ర నాయకులు పోలాడి శ్రీనివాసరావు,ఎం.రాజేశం, దూటా శేషగిరి, అంజయ్య, పర్లపల్లి అభిషేక్, వివిధ గనుల పిట్ సెక్రటరీలు మురళి, ఉప్పులేటి తిరుపతి, లక్ష్మణ్, అడ్డగట్ల గోపి, రవీందర్, జనగామ మల్లేష్, పులిపాక శంకర్,వాసర్ల జోసెఫ్, కొయ్యడ మల్లేష్, గండు శ్రావణ్, వెంకటరెడ్డి, మీసరాజు,నరేష్, దేవేందర్,మల్లారెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం..



గోదావరిఖని, జనంసాక్షి : ఉగాదిపర్వదినం పురస్కరించుకొని, వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ,(వి.ఎస్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో అందించే ఉగాది పురస్కారాల కోసం ఉభయ తెలుగు రాష్ట్రాలలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు,సామాజిక సేవకులు, కవులు, కళాకారులు, పురహితులు, విద్య, వైద్య రంగం, సాహిత్యం, సంగీతం, నృత్యం,చిత్రలేఖనం, శిల్పం, జానపదం, మిమిక్రి, ఇంద్రజాలం, హరికథ, బుర్రకథ, కోలాటం మొదలైన అంశాలతో పాటూ తదితర సేవా రంగాలకు కూడా వారికి ఈ పురస్కారాలు ఇవ్వడం జరుగుతుందిఅని.వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ తెలిపారు.ఆసక్తి గలవారు పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.మరిన్ని వివరాలకు 8977748838 నంబర్‌ను సంప్రదించాలని డాక్టర్ సురభి శ్రీధర్ తెలిపారు.

## ఆర్థిక సహాయం అందజేత



కోనరావుపేట(జనంసాక్షి): మర్ధనపేట గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కీర్తన సిరిసిల్ల కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఆమె తన కాలేజీ ఫీజు పరీక్ష ఫీజు కట్టలేని స్థితిలో సతమతమవుతుండటంతో విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకొని అదే గ్రామానికి చెందిన ముంద్రాయి సతీష్ కుమార్ రూ.10,500/-లను కాలేజీ ఫీజునీ తన ముంద్రాయి విజయకుమార్ ద్వారా కీర్తనకి అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతులు తెలిపారు.




## విద్యుత్ సవరణ బిల్లు 2025ను రద్దు చేయాలి

- కోనరావుపేటలో విద్యుత్ గ్రామపంచాయతీ కార్మికుల గర్జన..
- రాష్ట్ర అధ్యక్షులు కె. ఈశ్వర్

కోనరావుపేట(జనంసాక్షి): కోనరావుపేట దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గ్రామ పంచాయతీ కార్మికులు సెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో కోనరావుపేట మండల కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కర్నాల అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమ్మెకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వంతీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లు 2025ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణ వల్ల సామాన్య ప్రజలపై భారంతో పాటు కార్మికుల భవిష్యత్తు అంధకారమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.కార్మికుల పొట్టకొట్టే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, నిలిపివేసిన ఎఫ్.టి.ఎ ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఐటిఐ చదివిన కార్మికులను అసిస్టెంట్ హెల్పర్ అని పిలవడం సిగ్గుచేటని, వారిని వెంటనే జెఎల్‌ఎమ్ గా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నేతలు మాట్లాడుతూ.. సెస్ కార్మికులకు పదోన్నతులు కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 2025 సెప్టెంబర్ నుండి రావాల్సిన యాన్యువల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లను వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎల్లారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి విమల, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, ఆశా వర్కర్ల సంఘం ప్రతినిధులు వరలక్ష్మి, జమున, గ్రామ పంచాయతీ సంఘం నేతలు గోపాల్, శ్రీనివాస్, హమాలీ సంఘం రాజు, సురేశ్, మధ్యాహ్న భోజన పథక సంఘం కవిత, వసంత మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు..

## కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పక్కాగా నిబంధనలను పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని కలెక్టర్ కౌంటింగ్ సిబ్బందికి హితవు పలికారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తు ఉంటుందని అన్నారు అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్ అధికారులు తదితరులు ఉన్నారు.




## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం..

### - ఐఎఫ్‌టీయూ విప్లవ జేజేలు..

గోదావరిఖని, జనంసాక్షి : దేశవ్యాప్త సమ్మె సందర్భంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గోదావరిఖని గాంధీ చౌరస్తాలో నిరసన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ మాట్లాడుతూ స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో బీజేపీ మోడీ ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందం దేశ రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని నాశనం చేస్తుందని,కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను, స్వేచ్ఛను హరించి వేస్తుందని, బీజేపీ విధానాలు ఈ దేశ మెజారిటీ శ్రమ జీవులైన శ్రామిక ప్రజల జీవన విధానంను సర్వం అస్తవ్యస్తం చేస్తుందని,ఈ పరిస్థితిని అర్థం చేసుకొని ప్రజలు, రైతులు, కార్మికులు మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని లేకుంటే భవిష్యత్ అంధకారమే అని స్పష్టం చేశారు.బీజేపీ మోడీ ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందం,నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, మహాత్మా గాంధీ, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచి, రాబోయే కాలంలో ఆ పథకాన్ని రద్దు చేసే విబిజీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడుల కాఫీలను దహనం చేశారు. ఈ సందర్భంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం రద్దు చేసుకోవాలని,కార్మికులకు నష్టకరమైన నాలుగు లేబర్ కోడ్‌ల అమలును వెనక్కితీసుకోవాలని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, విత్తన, విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్షులు ఈ.నరేష్ జిల్లా నాయకులు ఈదునూరి రామకృష్ణ, ఐ.రాజేశం, ఎం.దుర్గయ్య, ఎడ్ల రవికుమార్, ఎం.కొమరయ్య, ఎస్.ప్రసాద్, చింతల శేఖర్, రాయపోచం, కే.ధర్మేందర్, ఈ.మొండయ్య, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ విగ్రహానికి వెండి కళ్ళు విరాళం



పెద్దపల్లి,ఫిబ్రవరి 12 (జనంసాక్షి) : కమాన్‌పూర్ మండలం పెంచి కల్వేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవాలయానికి న్యూ మారేడుపాక కు చెందిన సింగరేణి ఉద్యోగి దాడి కుమార్ స్వామి విగ్రహానికి (10,016) పదివేల పదహారు విలువ గల వెండి కళ్ళను గౌడ సంఘం అధ్యక్షులు బైరి అంజయ్య గౌడ్ కు అందజేశారు.ఈ సందర్భంగా గడ సంఘం తరపున దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

## సాగు భూములకే 'భరోసా'



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా నిలిచిపోయిన రైతుబంధు పథకం డబ్బులను 2024 జనవరిలో రైతుల ఖాతాల్లో జమ చేశారు. అదే ఏడాది. వానాకాలం సీజన్లో ప్రభుత్వం రైతు భరోసా కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించలేదు.కానీ 2 లక్షల రూపాయల వరకు పంట రుణాలను మాపి చేశారు. తర్వాత రాష్ట్రంలో సాగులో ఉన్న భూములను గురించి క్షేత్రస్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సర్వే చేసి లెక్కలు తీశారు. యితే ఈ సర్వే పకడ్బందీగా జరగలేదని, తూతూ మంత్రంగా జరిగిందని భావించిన ప్రభుత్వం గత ఏడాది యాసంగి సీజన్ నుంచి రైతుభరోసా పథకాన్ని ఆరంభించింది. తర్వాత 20025 జనవరిలో రైతు భరోసా పథకాన్ని అరంబించినప్పటికీ ఎకరాల రైతు భరోసా ప్రతి ఏటా 12000భూములు కలిగిన వారికి మాత్రమే రైతు భరోసా పథకం డబ్బులను రైతుల ఖాతాల్లో వేశారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన విధంగా కాకుండా ఎకరానికి 6 వేల చొప్పున ఇచ్చారు. రైతుల ఖాతాల్లో జమ చేశారు. 5 ఎకరాలకు పైగా భూములు ఉన్న వారికి పెట్టుబడి సాయాన్ని ఇవ్వలేదు. గడిచిన వానాకాలం సీజన్లో పూర్తి ప్రభుత్వం జమ చేసింది. అప్పుడు పట్టా కలిగిన రైతుల ఖాతా లోనే జమ చేశారు. అయితే యాసంగి సీజన్ నుంచి ప్రతీ సీజన్లో పంటలు సాగు చేసే రైతులకే రైతుభరోసా పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది ముందుగా మొత్తానికే పంటలు పండించే వారికి మాత్రమే రైతు భరోసా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంది శాటిలైట్ మ్యాపింగ్ సర్వే తో నే పంట భూములను గుర్తించి రైతు భరోసా అందజేస్తారు.

